నమస్తే తెలంగాణ
సూర్యాపేట
5 | నల్లగొండ, శనివారం 3 ఆగస్టు 2024 | SURYAPET

జాతీయ స్థాయి త్రోబాల్ పోటీలకు హుజూర్‌నగర్ యువకుడు

త్రోబాల్ కోర్టులో భార్గవాచారి

హుజూర్‌నగర్, ఆగస్టు 2 : జాతీయ స్థాయి త్రోబాల్ పోటీలకు హుజూర్‌నగర్ పట్టణ పరిధిలోని మాధవరాయినిగూడెం గ్రామానికి చెందిన కన్నెకంటి భార్గవాచారి ఎంపికయ్యారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ఆయన ఉత్తమ ప్రతిభ కనబరిచి ఎంపికైనట్లు శుక్రవారం తెలిపారు ఈ నెల 4, 5 తేదీల్లో బెంగళూరులో జరుగనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు చెప్పారు.

మూడేండ్లలో ప్రాజెక్టులు పూర్తి

- ఉమ్మడి జిల్లాను సస్యశ్యామలం చేస్తాం
- పెండింగ్ పనుల పూర్తికి ప్రాధాన్యం
- మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి
- సాగర్ ఎడమ కాల్వకు సాగునీటి విడుదల

వరద కాల్వకు నీటిని విడుదల చేస్తున్న మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, చిత్రంలో మాజీ సీఎల్పీ నేత జానారెడ్డి, ఎమ్మెల్యేలు బాలూనాయక్, బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, నల్లగొండ కలెక్టర్ నారాయణరెడ్డి

నల్లగొండ ప్రతినిధి, ఆగస్టు 2(నమస్తే తెలంగాణ) : ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిధిలోని సాగునీటి ప్రాజెక్టులన్నింటిని వచ్చే మూడేండ్లలో పూర్తి చేస్తామని రాష్ట్ర మంత్రులు నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రకటించారు. పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టుల పూర్తికి యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. శుక్రవారం నాగార్జునసాగర్ నుంచి ఎడమకాల్వ ఆయకట్టు, లోలెవల్ కెనాల్‌కు ఆర్‌అండ్‌బీ మంత్రి కోమటిరెడ్డితో కలిసి భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ సాగునీటిని విడుదల చేశారు. పెద్దవూర మండలం పొట్టిచెల్మ వద్ద ఎడమకాల్వ హెడ్ రెగ్యులేటర్ వద్ద ప్రత్యేక పూజలు చేసి కృష్ణమ్మకు సారెను సమర్పించారు. అనంతరం స్విచ్ ఆన్ చేసి కాల్వలోకి నీటిని వదిలారు. అనంతరం లోలెవల్ కెనాల్ పంపుహౌస్ వద్దకు చేరుకుని పూజల అనంతరం సాగునీటిని కాల్వలోకి వదిలారు. ఎడమ కాల్వకు 10 వేల నుంచి 11వేల క్యూసెక్కుల నీటిని, లో లెవల్ కెనాల్‌కు 400 క్యూసెక్కుల నీటిని విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. అనంతరం విజయ విహార్‌లో మీడియాతో మంత్రులు మాట్లాడారు. పదేండ్ల కాలంలో నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు ఇంత త్వరగా సాగునీటిని విడుదల చేసిన ఘనత తమదేనని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. పూర్తి సామర్థ్యంతో నీటిని వదులుతూ కాల్వ వెంట ఉన్న చెరువులు, కుంటలు నింపుతూ తాగు, సాగు నీటి అవసరాలను తీర్చనున్నట్లు చెప్పారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులన్నింటినీ పూర్తి చేస్తామన్నారు. ముఖ్యంగా ఎస్ఎల్‌బీసీ సొరంగమార్గం, డిండి ఎత్తిపోతల, బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టు, పిల్లాయిపల్లి వంటి పనులకు ప్రాధాన్యమిస్తూ యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయనున్నట్లు తెలిపారు. కృష్ణా నదిపై నిర్మాణంలో ఉన్న ఎత్తిపోతల పథకాలతోపాటు కొత్తగా ప్రారంభించాల్సిన వాటిని సైతం పూర్తి చేయనున్నట్లు తెలిపారు. గంధమళ్ల రిజర్వాయర్‌ను 1.50టీఎంసీల సామర్థ్యంతో త్వరలోనే పూర్తి చేయాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలోని అన్ని ప్రాజెక్టులను మూడేండ్లల్లో పూర్తి చేసి ప్రజల రుణం తీర్చుకుంటామని ప్రకటించారు. ఏఎమ్మార్పీ కాల్వకు లైనింగ్ పనులు, సొరంగ మార్గాన్ని పూర్తి చేయడంతోపాటు ఏఎమ్మార్పీ కాల్వ లైనింగ్ చేపట్టి సుమారు 4లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరిస్తామన్నారు. పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసి జిల్లాను సస్యశ్యామలం చేస్తామన్నారు. సాగర్ నీటితో ప్రణాళికబద్ధంగా అన్ని చెరువులు, కుంటలను నింపుతామన్నారు. కార్యక్రమంలో మాజీ సీఎల్పీ నేత జానారెడ్డి, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, ఎమ్మెల్యేలు ఎన్.బాలునాయక్, బత్తుల లక్ష్మారెడ్డి, ఇరిగేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ రాహుల్‌బొజ్జా, ఈఎన్‌సీ అనిల్‌కుమార్, కలెక్టర్ నారాయణ రెడ్డి, సీఈ నాగేశ్వర్‌రావు, ఎస్పీ శరత్ చంద్ర పవార్, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

మంత్రి ఉత్తమ్ తడబాటు

నాగార్జునసాగర్ ఎడమకాల్వకు నీటి విడుదలపై చెబుతూ మంత్రి ఉత్తమ్ తడబాటుకు గురయ్యారు. పదేండ్ల నుంచి ఇంత తొందరగా సాగర్ నీళ్లు ఎన్నడూ వదలి పెట్టలేదని, పూర్తి కెపాసిటీతో నీళ్లు వదలిపెట్టడం జరుగుతుంది చెప్పుకొచ్చారు. కాగా, 2022లో ఇంతకు ఐదు రోజుల ముందే అప్పటి కేసీఆర్ సర్కార్ సాగునీటిని విడుదల చేసిందనేది సాగర్ ప్రాజెక్టు అధికారుల లెక్కలు స్పష్టం చేస్తున్నాయి. 2022 జూలై 28న సాగర్ నుంచి ఎడమకాల్వకు, ఏఎమ్మార్పీ, లో లెవల్ కెనాల్‌కు అప్పటి మంత్రి జగదీశ్‌రెడ్డి చేతుల మీదుగా సాగునీటిని విడుదల చేశారు. ఈ విషయాన్ని దాచిపెట్టాలనో, సరైన సమాచారం లేకనో మంత్రి ఉత్తమ్ తామే ఇంత ముందుగా సాగునీటిని విడుదల చేస్తున్నట్లు ప్రకటించడంతో అక్కడ ఉన్న మీడియాతో పాటు అధికారులు విస్మయం వ్యక్తం చేశారు.

భారీగా హడావుడి

సాగర్‌కు వరద ఉధృతి పెరిగిన వెంటనే ఆగస్టులో సాగునీటి విడుదలను సహజంగానే చేస్తుంటారు. అయితే శుక్రవారం ఎడమ కాల్వ నీటి విడుదల కార్యక్రమానికి మాత్రం భారీ హడావిడి చేశారు. ఎప్పుడూ లేనివిధంగా జిల్లాలోని మెజార్టీ పోలీసు అధికారులను, సిబ్బందిని సాగర్‌కు తరలించారు. ముందు ప్రకటించిన విధంగా ఉత్తమ్, కోమటిరెడ్డితోపాటు ఖమ్మం జిల్లా మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు హాజరుకావాల్సి ఉంది. చివరలో పొంగులేటి, తుమ్మల హాజరుకాలేదు. నల్లగొండ జిల్లాకు చెందిన మంత్రులు మాత్రమే పాల్గొన్నా సాగర్‌లోని విజయవిహార్ నుంచి పొట్టిచెల్మ వరకు 10 కిలోమీటర్ల మేర భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎడమకాల్వ రెగ్యులేటరీ వద్దకు వెళ్లేందుకు మూడు చోట్ల చెక్‌పోస్టులు పెట్టారు. మీడియా ప్రతినిధులను కూడా ఐడీ కార్డులు ఉంటేనే అనుమతించారు. సాధారణంగా ముఖ్యమంత్రి పర్యటనకు మించిన బందోబస్తు చర్యలు, చెకింగ్‌లు చేపట్టడంతో మంత్రుల ప్రోగామ్‌కే ఇంత హడావుడి ఎందుకన్న చర్చ వినిపించింది. హెడ్‌రెగ్యులేటరీ వద్ద గతంలో మంత్రి జగదీశ్‌రెడ్డితోపాటు ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు నీటిని విడుదల చేస్తున్న సమయంలో మీడియాతోపాటు రైతులు, ప్రజలకు సైతం అనుమతి ఉండేది. ఈసారి రోప్ వేసి ఎవ్వరినీ దగ్గరకు అనుమతించ లేదు. ప్రజా పాలన అంటూ ఎన్నడూ లేనివిధంగా బందోబస్తు, ఎక్కడికక్కడ నిలువరింతలు, చెకింగ్ పెట్టడం ఏంటన్న దానిపై చర్చ సాగింది.

పోలీసుల అత్యుత్సాహం

ఎడమ కాల్వ వద్దకు వెళ్లకుండా పోలీసుల భారీ బందోబస్తు

నందికొండ : మంత్రుల పర్యటన సందర్భంగా పోలీసులు భారీగా మోహరించారు. రైతులు, కాంగ్రెస్ నాయకులు, మీడియాను ఎక్కడికక్కడ అడ్డుకుని అత్యుత్సాహం ప్రదర్శించారు. నీటి విడుదల తర్వాత హిల్‌కాలనీ విజయవిహార్‌కు వచ్చిన మంత్రులను కలవడానికి వచ్చిన వారిని విజయవిహార్ ఎంట్రెన్స్ గేటు వద్దే ఆపారు. దాంతో కాంగ్రెస్ నేతలు, రైతులు వాగ్వాదానికి దిగారు. మీడియా ప్రతినిధులు వీడియోలు, ఫొటోలు తీసుకునేందుకు కూడా ఎడమ కాల్వకు ఏర్పాటు చేసిన విద్యుత్ రక్షణ వలయం బయట గోడ పక్కన లారీ పెట్టి దాన్నే మీడియా పాయింట్‌గా చెప్పడం గమనార్హం. కొందరు విలేకరులు ఫొటో లు తీసే క్రమంలో స్వల్పంగా విద్యుత్ షాక్ తగలడంతోపాటు కెమెరాలు కింద పడిపోయాయి.

ఇదేం ప్రజా పాలన?

పెండింగ్ బిల్లులు అడిగితే అరెస్టులా?

చందంపేట పోలీస్ స్టేషన్‌లో మాజీ సర్పంచ్‌లు

- కాంగ్రెస్ సర్కారుపై మాజీ సర్పంచ్‌ల ఆగ్రహం
- చలో సెక్రటేరియట్‌కు వెళ్లకుండా ఎక్కడికక్కడ అడ్డుకున్న పోలీసులు
- ముందస్తు అరెస్టులతో స్టేషన్ల ఎదుటే మాజీ ప్రజాప్రతినిధుల నిరసన

సూర్యాపేట, ఆగస్టు 2 (నమస్తే తెలంగాణ) : 'అప్పులు తెచ్చి గ్రామాలను అభివృద్ధి చేసిన పనులకు సంబంధించిన బిల్లులు అడిగితే అరెస్టు చేస్తారా? మా గోడు వినిపించేందుకు అని సెక్రటేరియట్‌కు వెళ్తుంటే అక్రమంగా అడ్డుకుని స్టేషన్లకు తరలిస్తారా? ఇదేం ప్రజా పాలన' అంటూ మాజీ సర్పంచ్‌లు మండిపడుతున్నారు. పెండింగ్ బిల్లులు విడుదల చేయాలనే డిమాండ్‌తో మాజీ సర్పంచ్‌లు శుక్రవారం తలపెట్టిన చలో సెక్రటేరియట్ కార్యక్రమాన్ని పోలీసులు ఎక్కడికక్కడ అడ్డుకున్నారు. ముందస్తు అరెస్టులు చేసి మాజీ సర్పంచ్‌లను పోలీస్ స్టేషన్లకు తరలించారు. దాంతో పలుచోట్ల మాజీ సర్పంచ్‌లు స్టేషన్ల ఎదుటే నిరసన తెలిపారు. ఉమ్మడి నల్లగొండ జిల్లావ్యాప్తంగా ఈ ముందస్తు అరెస్టులు కొనసాగాయి. సూర్యాపేట జిల్లాలోని మోతె, తిరుమలగిరి, ఆత్మకూర్.ఎస్, నాగారం మండలాల్లో పలు గ్రామాల మాజీ సర్పంచ్‌లను పోలీసులు ఉదయమే అదుపులోకి తీసుకున్నారు. నల్లగొండ జిల్లా కట్టంగూర్, కేతేపల్లి, వేములపల్లి, దేవరకొండ మండలాల్లోనూ అరెస్టులు కొనసాగాయి. యాదాద్రి భువనగిరి జిల్లాలో ఆలేరు, మోత్కూరు మండలాల్లో ముందస్తు అరెస్టులు చేశారు. ఎలాగోలా హైదరాబాద్‌కు చేరిన మోత్కూరు మండల మాజీ సర్పంచ్‌లను అక్కడ పోలీసులు అరెస్ట్ చేశారు. బీబీనగర్ మండలంలోని రహీంఖాన్‌గూడెం గ్రామ మాజీ సర్పంచ్, మాజీ సర్పంచ్‌ల ఫోరం మండలాధ్యక్షుడు రవికుమార్‌ను హౌస్ అరెస్ట్ చేశారు. చేసిన పనులకు బిల్లులు ఇవ్వకపోగా, రాజ్యాంగం కల్పించిన హక్కు మేరకు శాంతియుతంగా నిరసన వ్యక్తం చేసే అవకాశాన్ని కూడా కాంగ్రెస్ ప్రభుత్వం ఇవ్వడం లేదని మాజీ సర్పంచ్‌లు మండిపడుతున్నారు.

తిరుమలగిరి పోలీస్ స్టేషన్‌లో మాజీ సర్పంచ్‌లు

క్రస్ట్ గేట్లను తాకిన కృష్ణమ్మ

551.30 అడుగులకు చేరిన సాగర్ నీటి మట్టం

- శ్రీశైలం నుంచి 4,89,361 క్యూసెక్కుల వరద
- ఎడమ కాల్వకు క్రమంగా 5వేల క్యూసెక్కుల చొప్పున నీటి విడుదల

సాగర్ డ్యాం క్రస్ట్ గేట్ల ఎగువకు చేరిన నీరు

నందికొండ, ఆగస్టు 2 : నాగార్జునసాగర్ రిజర్వాయర్‌కు భారీగా వరద నీరు వచ్చి చేరుతుండడంతో నీట మట్టం గణనీయంగా పెరుగుతూ శుక్రవారం క్రస్ట్ గేట్ల లెవల్ 546 అడుగులను దాటి 551.30 (212.6510 టీఎంసీలు) అడుగులకు చేరింది. పూర్తి స్థాయి నీటి మట్టానికి మరో 39 అడుగులు మాత్రమే ఉండగా, రోజుకు 10 టీఎంసీలకు పైనీరు వచ్చి చేరుతుండడంతో నిండుకుండలా మారుతుంది. వరద ఇదే తీరుగా కొనసాగితే మూడ్రోజుల్లో క్రస్ట్ గేట్లను ఎత్తే అవకాశం ఉందని అధికారులు చెప్తున్నారు. శ్రీశైలం రిజర్వాయర్‌కు ఎగువ నుంచి 4,89,361 క్యూసెక్కుల వరద పోటెత్తుతుండగా, డ్యామ్ క్రస్ట్ గేట్లు పదింటి ద్వారా, జలవిద్యుత్ కేంద్రాల ద్వారా 5,28,411 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు విడుదల చేస్తున్నారు. దాంతో నాగార్జునసాగర్ జలాశయం నీటి మట్టం గంట గంటకు పెరుగుతున్నది. నాగార్జునసాగర్ రిజర్వాయర్ నుంచి కుడి కాల్వ ద్వారా 5,292 క్యూసెక్కులు, ఎడమ కాల్వ ద్వారా 778, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1,650, వరద కాల్వ ద్వారా 400, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 23,744 క్యూసెక్కులు మొత్తం కలిపి 31,864 క్యూసెక్కుల అవుట్ ఫ్లో కొనసాగుతున్నది.

ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లోలో భారీ వ్యత్యాసం

శ్రీశైలం రిజర్వాయర్ నుంచి విడుదల అవుతున్న అవుట్ ఫ్లోకు, నాగార్జునసాగర్ రిజర్వాయర్‌కు వచ్చి చేరుతున్న ఇన్‌ఫ్లోకు ఎన్నెస్పీ అధికారులు లక్షల్లో వ్యత్యాసం చూపుతున్నారు. శ్రీశైలం రిజర్వాయర్ నుంచి ఉదయం 4,85,201 అవుట్ ఫ్లో ఉండగా, నాగార్జునసాగర్ రిజర్వాయర్‌కు వచ్చి చేరుతున్న ఇన్‌ఫ్లో 3,36,543 క్యూసెక్కులుగా చూపారు. దీనిపై అధికారుల వివరణ కోరగా. సాగర్‌కు చేరిన నీటిని మాత్రమే లెక్కలోకి తీసుకుంటున్నామని చెప్పారు.

నీటి లభ్యతను బట్టి..

సాగర్ ఎడమ కాల్వకు 778 క్యూసెక్కులు, వరద కాల్వకు 400 క్యూసెక్కులతో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి శుక్రవారం నీటి విడుదలను ప్రారంభించారు. క్రమంగా పెంచుకుంటూ 5,000 క్యూసెక్కులతో ఎడమ కాల్వకు వానకాలం పంట సాగుకు నీటి విడుదలను కొనసాగించనున్నట్లు ఎన్నెస్పీ అధికారులు తెలిపారు. రిజర్వాయర్‌లోకి వరద వచ్చి చేరే అంచనాను బట్టి ఆన్ అండ్ ఆఫ్ పద్ధతిలో నీటి లభ్యతను బట్టి విడుదల ఉంటుందని పేర్కొన్నారు. వరద కాల్వకు 400 క్యూసెక్కులతో నీటి విడుదలను కొనసాగిస్తామని చెప్పారు.

అప్రమత్తంగా ఉండాలని ఈఎన్‌సీ ఆదేశం

నాగార్జునసాగర్ డ్యామ్‌ను ఈఎన్‌సీ అనిల్‌కుమార్ శుక్రవారం సాయంత్రం సందర్శించారు. వరద భారీగా వచ్చి చేరుతున్నందున డ్యామ్ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా విధులు చేపట్టాలని ఆదేశించారు. డ్యాం భద్రతకు ఢోకా లేకుండా సమాచారాన్ని ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు చేరవేయాలన్నారు. కంట్రోల్ రూమ్‌లో నీటి నివేదికలను జాగ్రత్తగా నమోదు చేయాలని సూచించారు. డ్యామ్ నిర్వహణకు సంబంధించి కంట్రోల్ రూమ్ ఆంధ్రా ఆధీనంలో ఉన్నందున ఉన్నతాధికారులతో చర్చిస్తామన్నారు.

బడి వదిలి సీఎం సభకు!

అస్తవ్యస్తంగా పాఠశాలల నిర్వహణ

- ఎల్బీ స్టేడియానికి పెద్ద ఎత్తున తరలిన టీచర్లు
- నల్లగొండ జిల్లా నుంచి 23 ప్రత్యేక బస్సుల్లో తరలించిన విద్యాశాఖ
- సూర్యాపేట జిల్లా నుంచి 18 బస్సుల్లో 800 మంది తరలింపు

సీఎం సభ కోసం ఎల్బీ స్టేడియానికి మిర్యాలగూడ నుంచి వెళ్తున్న వాహనాలకు జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి.

నల్లగొండ అర్బన్/ రామగిరి/ మిర్యాలగూడ/ సూర్యాపేట/ హుజూర్‌నగర్, ఆగస్టు 2 : ఇటీవల ఉద్యోగోన్నతులు పొందిన గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులతో శుక్రవారం హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నల్లగొండ జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో 23 ప్రత్యేక బస్సుల్లో ఆయా విభాగాల్లో ఉద్యోగోన్నతులు పొందిన 1,153 మంది ఉపాధ్యాయులు సభకు వెళ్లారు. ప్రతి స్కూల్‌లో 6నుంచి 8మంది ఉపాధ్యాయులు ఉద్యోగోన్నతి పొందగా.. వారంతా సభకు వెళ్లడంతో పాఠాలు బోధించేవారు లేక విద్యార్థులు బయట తిరిగారు. కొన్ని స్కూళ్లలో ఒక్క ఉపాధ్యాయుడు కూడా లేని పరిస్థితి నెలకొంది. మరికొన్ని స్కూళ్లలో ఒకరిద్దరు టీచర్లు ఉండడంతో విద్యార్థులు పాఠశాల ఆవరణలో కాలక్షేపం చేశారు. మిర్యాలగూడ నియోజకవర్గం నుంచి వెళ్లే ఉపాధ్యాయుల వాహనాలకు ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. పని దినాల్లో పాఠాలు చెప్పకుండా ఉపాధ్యాయులు సభకు వెళ్లడం ఏమిటని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు.

జిల్లాలో సుమారు 3,600 మంది ఉపాధ్యాయులు ఉండగా.. ఒకే రోజు 800 మందికి పైగా సభకు వెళ్లడంతో విద్యా సంవత్సరంలో విలువైన ఒక రోజు తరగతులను విద్యార్థులు కోల్పోయారు. జిల్లాలోని కొన్ని పాఠశాలల్లో సగానికిపైగా ఉపాధ్యాయులు సభకు వెళ్లడంతో తరగతుల నిర్వహణ సక్రమంగా లేకపోయింది. దీంతో పాఠశాలల్లో ఉన్న ఉపాధ్యాయులకు పనిభారం పెరిగిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి కార్యక్రమాలు సెలవు దినాల్లో నిర్వహించుకోవాలని సూచిస్తున్నారు.

సూర్యాపేట జిల్లా నుంచి 800 మంది ఉపాధ్యాయులు

హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో సీఎం ముఖాముఖి కార్యక్రమానికి సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా ఉద్యోగోన్నతులు పొందిన 800 మంది ఉపాధ్యాయులను జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో తరలించారు. ఇందుకోసం సూర్యాపేట డిపో పరిధిలోని 18 ఆర్టీసీ బస్సులను తీసుకెళ్లారు. పాఠశాల పని దినాల్లో పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు రాకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. ఒకరిద్దరు ఉన్న పాఠశాలల విద్యార్థులు తరగతుల నిర్వహణ లేకపోవడంతో బయట తిరిగారు. హుజూర్‌నగర్ నియోజకవర్గంలో ప్రమోషన్లు పొందిన 228 మంది ప్రభుత్వ ఉపాధ్యాయులు నాలుగు బస్సుల్లో సీఎం ముఖాముఖి కార్యక్రమానికి వెళ్లారు. వారికి ఆర్టీఓ శ్రీనివాసులు అల్పాహారం ఏర్పాటు చేశారు.

జిల్లా వ్యాప్తంగా సభకు వెళ్లిన వారిలో ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు 113మంది, స్కూల్ అసిస్టెంట్ బయాలజీ – 43, స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లిషు – 30, స్కూల్ అసిస్టెంట్ హిందీ – 95, స్కూల్ అసిస్టెంట్ మ్యాథ్స్ – 48, స్కూల్ అసిస్టెంట్ మ్యాథ్స్ ఉర్దూ – 1, స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ – 83, స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ సైన్స్ – 3, స్కూల్ అసిస్టెంట్ సోషల్ స్టడీస్ – 69, స్కూల్ అసిస్టెంట్ తెలుగు – 127, స్కూల్ అసిస్టెంట్ స్పెషల్ ఎడ్యుకేషన్ – 3, ఇతరులు 185 మంది ఉన్నారు. ఉపాధ్యాయుల తరలింపు కోసం ఒక బస్సుకు రూ.25వేలు ఖర్చు చేయనున్నారు. 18 బస్సులకు 4.50లక్షలు ఆర్టీసీకి చెల్లించాల్సి ఉన్నది. అయితే.. ఆర్టీసీ బస్సులను సభకు తీసుకెళ్లడంతో గ్రామాలకు వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.

తరలింపు ఖర్చుతో కూడుకున్నది

ప్రమోషన్ ఇచ్చిన వారికి ఇలాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయాలి. కానీ.. ప్రస్తుత పరిస్థితుల్లో మీడియా, సోషల్ మీడియా ద్వారా ఇలాంటివి నిర్వహించి ఉపాధ్యాయులకు దిశానిర్దేశం చేస్తే సరిపోయేది. జిల్లా నుంచి ఒకేరోజు 800 మందిని, రాష్ట్ర వ్యాప్తంగా 24వేల మంది ఉపాధ్యాయులను తరలించడం ఆలోచించదగిన విషయం. సీఎం కార్యక్రమానికి సగానికిపైగా ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు వెళ్లడం మూలంగా విద్యార్థులు ఒకరోజు నష్టపోయారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు కేటాయించకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

- దామర శ్రీనివాస్, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు, తిరుమలగిరి

కాంట్రాక్టర్ కార్యాలయంగా మారిన రోగుల సహాయకుల కోసం నిర్మించిన గది

రోగి సహాయకుల గది కాంట్రాక్టర్ కబ్జా

సూర్యాపేట జిల్లా ఆస్పత్రిలో నిర్వాకం

- నెలలుగా తిష్ట వేసి ఖాళీ చేయని వైనం
- ఎండా, వానకు చెట్ల కింద పేషెంట్ అటెండెంట్ల అవస్థ
- పట్టించుకోని అధికారులు

చెట్ల కింద ఇబ్బంది పడుతున్న రోగుల సహాయకులు

సూర్యాపేట, ఆగస్టు 2 (నమస్తే తెలంగాణ) : సూర్యాపేట ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి వచ్చే రోగుల సహాయకుల కోసం నిర్మించిన షెడ్డును కాంట్రాక్టర్ కబ్జా చేశాడు. వారం, పది రోజుల పాటు షెడ్డును వినియోగించుకుంటామని అందులో చేరి అక్కడే తిష్ట వేశాడు. ఇప్పుడు గదిని ఖాళీ చేయకుండా కార్యకలాపాలు సాగిస్తుండడంతో రోగుల సహాయకులు ఎండ, వాన, చలికి ఇబ్బందులు పడుతూ చెట్ల కింద ఉండిపోతున్నారు. సూర్యాపేటలో మెడికల్ కళాశాల ఏర్పాటవడంతో అత్యాధునిక వైద్య సేవల కోసం జిల్లా ప్రజలేగాక దూర ప్రాంతాల నుంచి రోగులు వస్తున్నారు. గతంలో ఇక్కడ ఏరియా ఆసుపత్రిగా ఉండగా మెడికల్ కళాశాల రావడంతో జనరల్ ఆసుపత్రిగా మారి 350 పడకల ఆసుపత్రికి చేరింది. మెడికల్ కాలేజీకి అనుబంధంగా వెయ్యి పడకల ఆసుపత్రికి కూడా అనుమతులు వచ్చాయి. ఈ క్రమంలో ఇక్కడ ఆసుపత్రిని నిర్మించేందుకు టెండర్లు ఖరారు కాగా ఏడు నెలల క్రితం కాంట్రాక్టర్ సూర్యాపేటకు చేరుకొని స్థలాన్ని పరిశీలించి ఉద్యోగులు, నిర్మాణ కార్మికులతోపాటు సామాన్లు ఉంచేందుకు తాత్కాలిక షెడ్లు నిర్మించుకున్నారు. అంతవరకు బాగానే ఉన్నా.. అక్కడ రోగుల కోసం నిర్మించిన షెడ్డును తాత్కాలికంగా వాడుకుంటామని చెప్పి నెలలు గడుస్తున్నా ఖాళీ చేయడం లేదు. దాన్నే ప్రధాన కార్యాలయంగా మార్చుకుని కార్యకలాపాలు నిర్వహిస్తున్నాడు. రోగుల వెంట వచ్చే సహాయకులు రాత్రిళ్లు ఉండేందుకు ఇబ్బంది పడకుండా గత ప్రభుత్వం డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్‌తో కట్టిన గదినే ఈ కాంట్రాక్టర్ కబ్జా పెట్టాడు. దాంతో రోగుల సహాయకులు రాత్రిళ్లు, విజిట్ హవర్స్ లేని సమయంలో చెట్ల కింద, అరుబయట అవస్థలు పడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఆ గదిని పేషెంట్ల సహాయకుల కోసం వినియోగించాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయమై ఆసుపత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీకాంత్‌ను వివరణ కోరగా.. సీనియర్ డాక్టర్లు బదిలీపై వెళ్లడంతో తాను ఇటీవలే ఇన్‌చార్జి బాధ్యతలు చేపట్టినట్టు తెలిపారు. పేషెంట్ అటెండెంట్ల కోసం నిర్మించిన షెడ్డు వివరాలు తనకు తెలియదని, పరిశీలించి చర్యలు తీసుకుంటామని చెప్పుకొచ్చారు.